క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన శ్రీ సాయి భవానీ జ్యువెలర్స్ వారి తండ్రి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొండోజు లీలావతి వారి కుమారులు కొండోజు సువర్ణప్రతాప్ చారి, కొండోజు సహస్ర బాలవర్ధన్ చారి దంపతులు రూ.1,00,116లు విరాళం అందజేశారు. ఈ మొత్తం విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి సభ్యులు ధూపం నాగరాజు, విశ్వనాథం గంగాధర్, బలిజ లింగేశ్వర్, పొగాకు అనిల్‌కుమార్, వేముల సుధాకర్‌రెడ్డి, సత్యం సాగర్, లక్ష్మీనారాయణ, రఘునాథ్‌రెడ్డి, భాస్కర్, భీమ కిషోర్ అందజేశారు. అనంతరం అయ్యప్ప సేవా సమితి సభ్యులు వారి కుటుంబ సభ్యులను శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



వనపర్తి రూరల్: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ కోరారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మండలంలోని అప్పాయిపల్లి, కీర్యతండా, గుంతతండాలో పర్యటించి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, మండల అధ్యక్షుడు మాణిక్యం, రవిప్రకాష్‌రెడ్డి, విష్ణుయాదవ్, అశోక్‌రావు, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ధ్యేయం



ఆత్మకూర్: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్ అన్నారు. బుధవారం మండలంలోని జూరాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరుగకుండా, తూకాల్లో మోసం చేయకుండా చూడాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో నర్సింహ, మధు, మహిమూద్, చెన్నయ్య, శివన్న, అబ్దుల్, రైతులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



అమరచింత: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందిస్తున్నట్లు అమరచింత పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చింతరెడ్డిపల్లిలో 128 ఆవులు, 145 గేదెలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి ప్రారంభమైన కార్యక్రమం వచ్చే నెల 15 వరకు కొనసాగుతుందన్నారు.

దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని ప్రతీకారం

కొల్లాపూర్ రూరల్: దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రతీకారానికి పాల్పడుతుందని దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు ఆరోపించారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధినాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ సంస్థ చార్జిషీట్ దాఖలు చేయటాన్ని ఖండించారు. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన ఆస్తులను ఏకపక్షంగా, అన్యాయంగా సీజ్ చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్యలను ఖండిస్తు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనాలు చేస్తామని హెచ్చరించారు.

క్రీడలకు ప్రాధాన్యం

కొల్లాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తారని ఎంఈఓ ఇమ్మాన్యుయేల్ అన్నారు. బుధవారం మండలంలోని ఎన్మన్‌బెట్ల, జావాయిపల్లి గ్రామాల్లో పాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

భక్తుల ఇలవేల్పు సాయినాథుడు

- సిల్వర్‌జూబ్లీ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం



సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నాయకులు

ఆత్మకూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయం నిర్మించి బుధవారం నాటికి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, కాగడ హారతి, పంచామృత అభిషేకం, విశేష పూజలు, శ్రీలక్ష్మీగణపతిహోమం, మధ్యాహ్న హారతి, అన్నదానం, సాయంత్రం సాయిభజన, పల్లకీసేవ, శేషహారతి, తదితర పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

సాయిబాబా మందిరం సిల్వర్‌జూబ్లీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ట్రస్ట్ అధ్యక్షురాలు, రాష్ట్ర బాలల రక్షణ, హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమాల్లో మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసుధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదానం నిర్వహించిన ఎస్పీ దంపతులు

వార్షికోత్సవం సందర్భంగా పూజల్లో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు బంగారు భాస్కర్, ప్రకాష్, రవి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎస్పీ రావుల గిరిధర్, అపర్ణ దంపతులు పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, పూజారులు శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు, నిర్వాహకులు సిద్ధార్థరెడ్డి, జగదబిరెడ్డి, రామలక్ష్మారెడ్డి, నాయకులు ఆయూబ్‌ఖాన్, రహ్మతుల్లా, గంగాధర్‌గౌడ్, పరమేష్, ఎస్టీడీ శ్రీను, అరవింద్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వినయ్‌రెడ్డి, గాలి శ్రీను, సీఐ శివకుమార్, ఎస్ఐలు నరేందర్, సురేష్, శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న సీతమ్మ, స్వర్ణమ్మ



పూజలో ఎమ్మెల్యే జీఎమ్మార్ దంపతులు



పూజల్లో పాల్గొన్న ఎస్పీ గిరిధర్, అరుణ దంపతులు

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



జన్కో క్వార్టర్స్‌లో విన్యాసాలు ప్రదర్శిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జన్కో కాలనీలో బుధవారం సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విన్యాసాలతో క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బహుల అంతస్తుల్లో ప్రజలు ప్రమాదాల బారినపడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, నాగార్జున్, శ్రీనునాయక్, నర్సింహారెడ్డి, రాముడు, సందీప్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదీతరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి మంచం వితరణ

ఆత్మకూర్: స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు జిందే దశరథరావు స్మారకార్థం రూ.25 వేలు విలువచేసే మంచాన్ని కుటుంబ సభ్యులు అందజేశారు. బుధవారం ఆస్పత్రి వైద్యులకు జిందే గోపాల్‌రావు, జిందే నరేష్ రోగుల సౌకర్యార్థం మంచాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రావుల వెంకటేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల ర్యాలీ

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే పవిత్రత, యేసు ప్రభువు జీవిత విశేషాలను వివరిస్తూ వనపర్తి పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి వెంట యేసు కీర్తనలను పాడుతూ, యేసు లోక రక్షకుడని నినాదాలు చేశారు. గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, రాజీవ్ చౌక్, బస్సు డిపో రోడ్డు మీదుగా వనపర్తి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది.

డ్రైవర్లు, కండక్టర్లకు మజ్జిగ పంపిణీ



డ్రైవర్లు, కండక్టర్లకు మజ్జిగ పంపిణీ చేస్తున్న అధికారులు

వనపర్తిటౌన్: వేసవి తాపం పెరుగుతుండటంతో డ్రైవర్లు, కండక్టర్లకు వనపర్తి బస్టాండ్ ప్రాంగణంలోని హెల్ప్‌డెస్క్‌లో చల్లని మజ్జిగ అందజేస్తున్నట్లు స్టేషన్ మేనేజర్ ఎం.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం బస్టాండ్‌లో డ్రైవర్లు, కండక్టర్లకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడిని తట్టుకొని రోజులో సుమారు 10 గంటల పాటు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. కేవలం వనపర్తి డిపో డ్రైవర్లు, కండక్టర్లే కాకుండా ఇతర డిపోల నుంచి వచ్చే డ్రైవర్లు, కండక్టర్లకు సైతం అందిచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ మైనుద్దీన్, సీవై రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే సీసీకెమెరాలు

ఆత్మకూర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ జరుగుతుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గుంటిపల్లిలో సీసీకెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు ముందుకు రావాలని, సొంతంగా డబ్బులు సమకూర్చుకొని సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని రూ.1.05 లక్షలు ఎస్ఐ నరేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాష్, ఎల్లన్న, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేవల్లి ఎస్ఐగా రజిత

గోపాల్‌పేట: రేవల్లి మండల నూతన ఎస్ఐగా రజిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉంటామని, ప్రజలు సహకరించాలని కోరారు. రజిత గతంలో జోగులాంబ గద్వాల జిల్లా డీసీఆర్బీ ఎస్ఐగా పనిచేశారు. రేవల్లి ఎస్ఐగా విధులు నిర్వహించిన రాము జిల్లా పోలీసు కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి



కొత్తకోటలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కొత్తకోట: పోషణ పక్షంలో భాగంగా బుధవారం పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ జాతర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీడీపీఓ లక్ష్మమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు నవ్య మాట్లాడుతూ చిన్న పిల్లల శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్తకోట పీహెచ్‌సీ పరిమ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: గర్భిణులు, బాలింతలు సరైన పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. బుధవారం ఆత్మకూర్ మండలంలోని మోట్లంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, సరోజ, వైద్యసిబ్బంది, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

వనపర్తి రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సీడీపీఓ హజీరాబేగం తెలిపారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా ఆమె బుధవారం మండలంలోని అంజనగిరి, దత్తాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో అన్నప్రాసన చేశారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.



దత్తాయిపల్లిలో..


మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమానికి సూపర్‌వైజర్ భారతి హాజరై గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తారమ్మ, సుజాత, హంసమ్మ, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశావర్కర్ జిలేఖ పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని ఆందోళన



ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఆత్మకూర్, అమరచింత మండలాలకు చెందిన రైతులు వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు చివరి దశలో ఉన్నాయన్నారు. ఈ విషయమై జూరాల ప్రాజెక్టు అధికారులు, ఎమ్మెల్యే తక్షణమే స్పందించి జూరాల నుంచి సాగునీటిని విడుదల చేయాలని, లేకుంటే పంటలు ఎండిపోవడంతో రైతులు అప్పులపాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోవడంతో ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులను నచ్చజెప్పే ప్రయత్నం చేయగా.. వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారుల హామీతో రాస్తారోకో విరమించడంతో వాహన రాకపోకలు కొనసాగాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బంగారు శ్రీనివాసులు, విరేశలింగం, నాయకలు మండ్లరామకృష్ణ, కోటేష్, లక్ష్మణ్, రియాజ్, మాసన్న, భరత్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థి హాకీ క్రీడాకారుడు ఆదిత్యసాగర్ తరపున తల్లి భాగ్యలక్ష్మి, బంధువులు విష్ణు, హరితో కలిసి బుధవారం విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం భాగ్యలక్ష్మిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నవభారత్ యూత్ అధ్యక్షుడు నరేష్‌యాదవ్, రాష్ట్ర ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు, యువకులు రాజు, వెంకటేష్, వంశీ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పరమేశ్వరాచారి

వనపర్తి రూరల్: చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయిందని, ఆ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రైతులతో కలిసి వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వారం రోజుల క్రితం మార్కెట్ కు వరి ధాన్యం తీసుకొచ్చినా.. అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎండిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదని రైతులు వాపోతున్నారు. కేంద్రాలకు వచ్చే రైతులకు టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని, ఏ రోజు ధాన్యం ఆ రోజే మిల్లుకు పంపించాలని కోరారు. మార్కెట్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, వర్షపు నీరు సీసీపైకి వచ్చి రైతులకు నష్టం కలిగించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో నరసింహ, చిన్నయ్య, బీమన్న, పురుషోత్తం, వెంకట్రాంరెడ్డి, వెంకటేష్ నాయక్, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే ‘ఉపాధి’ పథకం



మెటంపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి



ఖిల్లాఘనపురంలో..

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మెంటపల్లిలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికి బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామ శివారులో జరుగుచున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలిలతో మాట్లాడగా.. రెండు నెలల నుంచి కూలి డబ్బులు చెల్లించలేదని వాపోయారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస వసతులైన తాగునీరు, నీడ కోసం టెంట్ కనిపించ లేదన్నారు. వారు రోడ్డుపై ఎండలో కూర్చుని భోజనం చేస్తున్న తీరు బాధాకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమంతు, తిరుమలయ్య, మంద సోమన్న, కురుమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకే కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని అమలు చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అన్నారు. బుధవారం గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం శివారులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కూలీలందరికి మజ్జిగ ప్యాకెట్లు పంచారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన పేదల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని కొనియాడారు. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, గ్రామ పంచాయతీల్లో చేపట్టే పనులు, ప్రతి నెల అందించే రేషన్ బియ్యం, ఇలా ఎన్నో పథకాల ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రోడ్లు, తాగునీరు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దశరథం, గోపాల్‌రెడ్డి, జిల్లా కౌన్సిలింగ్ సభ్యుడు సత్యనారాయణ, కిసాన్ మోర్చా నాయకులు రమేష్, ఎస్టీ మోర్చా నాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాళికాంబ విగ్రహ పునఃప్రతిష్ఠ



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



అమ్మవారి మూలవిరాట్

వనపర్తి టౌన్: స్థానిక పాతబజార్‌లోని కాళికాంబ సమేత కమతేశ్వర విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో రోడ్ల విస్తరణలో భాగంగా రోడ్డుకు అడ్డుగా ఉన్న కాళీమాతా ఆలయాన్ని ఏడాదిన్నర కిందట తొలగించడంతో పునఃప్రతిష్ఠకు ఆలయ కమిటీ సభ్యులు పూనుకున్నారు. గతానికి భిన్నంగా కాళీమాతాతో పాటుగా కమతేశ్వర మూర్తుల విగ్రహ స్థాపనతో ఆలయాన్ని నిర్మించారు. పునః ప్రతిష్టాపనలో భాగంగా మూడు రోజులుగా గణపతి హోమం, సుబ్రమణ్య హోమం, రక్షాబంధం, యంత్ర ప్రతిష్ఠ పూజల క్రతువులు బుధవారం పునఃప్రతిష్టాపన ఘట్టంతో ముగిశాయి. వేకువజాము నుంచి యంత్ర, కలశ, హోమాదులు, వాస్తుకట్ట, యంత్రాలను ఆవాహనం చేసి, ఆలయ ప్రదక్షిణతో పాటుగా గరక పూజ నిర్వహించి, దేవతా విగ్రహ మూర్తులకు జీవకళ ఉట్టిపడేలా మంత్రోచ్చరణ చేయడంతో భక్తుల అఖండ శరణు ఘోషల మధ్య జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామిజీ పర్యవేక్షణలో వేద పండితులు విజయవాడ దుర్గ రూపంలో విరాజిల్లుతున్న అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం తొలి దర్శనం కామధేను చేసిన అనంతరం భక్తులకు దర్శనానికి అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే రూ.3.5లక్షలు విరాళం అందించారు. రూ. లక్ష విరాళం ఇచ్చిన తిరుమల మహేష్‌ను ప్రత్యేకంగా ఆలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు పాకనాటి కృష్ణయ్య, బి.కృష్ణ, స్థానిక నాయకులు బొంబాయి మన్నెంకొండ, పరశురాం, వాకిటి ఆదిత్య, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



రాయిగడ్డలో విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘనీ

వనపర్తి విద్యావిభాగం: గురుకుల అర్హత పరీక్షల్లో జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం చంద్రజ్యోతి తెలిపారు. పాఠశాల నుంచి 17మంది విద్యార్థులు 5వ తరగతిలో గురుకుల పరీక్ష రాయగా.. 11మంది అర్హత సాధించారని హెచ్ఎం తెలిపారు. విద్యార్థులు గురుకుల అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటేందుకు కృషి చేసిన ఉపాధ్యాయురాలు మమత, రాణి, విద్యార్థులను డీఈఓ అబ్దుల్ ఘనీ అభినందించారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఏకంగా 15 మంది సీట్లు సాధించడాన్ని అభినందిస్తూ గ్రామ ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులను, సీట్లు సాధించిన విద్యార్థులను బుధవారం శాలువాలతో ఘనంగా సన్మానించి మెమోంటోలు అందజేశారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి తమ వంతు సహకారం అందిస్తూ వచ్చే విద్యా సంవత్సరంలో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



రేమద్దులలో..

గురుకులానికి విద్యార్థుల ఎంపిక

మండలంలోని చిక్కేపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కాశన్న బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన రిషిక (పెబ్బేర్), అనూష(వెల్టూరు), జయశ్రీ (కల్వకుర్తి), మానస (ఘట్‌కేసర్), శ్రీనిత్య (గోషామహల్) 5వ తరగతి చదివేందుకు ఆయా పాఠశాలలకు ఎంపికై నట్లు హెచ్ఎం పేర్కొన్నారు. గురుకులకు ఎంపిక కావడంలో పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. విద్యార్థుల ఎంపికపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం నూతన రెవెన్యూ చట్టం భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ సుగుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతువేదికలో గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని ఈ నూతన చట్టంపై అవగాహన పొందాలని ఆమె సూచించారు.